

ఢిల్లీలో ఎన్నికల శిక్షణకు
ఖమ్మం కలెక్టర్

పలువురు ఈఆర్వో, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు కూడా..


ఖమ్మం కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల ఎన్నికల శిక్షణ కోసం ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఢిల్లీకి వెళ్లారు. ఢిల్లీలోని ఐఐఐడీఎంఈ (ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్)లో 26, 27 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. దీని కోసం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం రాత్రి ఢిల్లీ వెళ్లారు. ఆయన గురు, శుక్రవారం నిర్వహించే శిక్షణలో పాల్గొంటారు. ఆయనతో పాటు జిల్లాలో పాలేరు రిటర్నింగ్ ఆఫీసర్ (ఈఆర్వో) ఎం.రాజేశ్వరి, ఖమ్మం రూరల్ మండలం బీఎల్వో సూపర్‌వైజర్లు వసంత (ఎలక్షన్ విభాగం సీనియర్ అసిస్టెంట్), ఖాదర్‌పాషా, బీఎల్వోలు ఎడవల్లి వినోద్‌కుమార్ ఖమ్మం వార్డు ఆఫీసర్, నిఖిల్ (పాలేరు గ్రామ పంచాయతీ సెక్రటరీ), హరీష్ గ్రామపంచాయతీ సెక్రటరీ మధిర మొత్తం ఆరుగురు ఈ శిక్షణకు ఢిల్లీ వెళ్లారు. ఎన్నికల విభాగంలో పలు అంశాలపై ఇచ్చే శిక్షణపై వారు అధ్యయనం చేసి ఇక్కడి సిబ్బందికి తర్ఫీదు ఇవ్వనున్నారు.

ఇదెక్కడి న్యాయం?

- పోలీసు ఉన్నతాధికారి నిందితులకు కొమ్ము కాస్తారా
- న్యాయం కోసం సీఎం, డీజీపీలను కలుస్తాం
- ఎన్ఆర్ఐ భార్య శ్రావ్య తల్లిదండ్రులు

6

రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు రికార్డు స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ చేసినా.. సాంకేతిక సమస్యలతో కొందరు రైతులకు ఇంకా సాగుసాయం అందలేదు. వ్యవసాయ పెట్టుబడి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా పథకంలో 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో కోట్లాది రూపాయలు జమచేసింది. పంటల సాగుచేసే రైతులకు విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేసేందుకు సకాలంలోనే పెట్టుబడి అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రుల నిర్ణయం మేరకు గతంలో ఎన్నడూలేని విధంగా రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే సాగు సాయం నిధులు జమ అయ్యాయి.



రైతు భరోసాకు సాంకేతిక సమస్యలు

- ఇంకా కొందరికి అందని సాగు సాయం నిధులు
- రైతుల బ్యాంకు ఖాతాల్లో సమస్యలే కారణం
- ఖాతాల పునరుద్ధరణకు బాధిత రైతుల పరుగులు

ఖమ్మం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాకు సంబంధించి 3,38,245 మంది రైతులకు రూ.427.85కోట్లు నిధులు జమ య్యాయి. అయితే సాంకేతిక సమస్యలతో జిల్లాలో ఇంకా కొందరు రైతులకు సాగుసాయం డబ్బులు అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 3,53,794మంది రైతులకు రూ.436.85కోట్లను రైతుభరోసాగా మంజూరు చేసి ట్రెజరీలో జమచేసింది. అయితే కొందరు రైతుల బ్యాంకు ఖాతాలు స్తంభించి ఉండడం, మరికొన్ని ఆధార్‌తో లింక్ కాకపోవడం, కొన్ని గ్రామీణ బ్యాంకుల్లో ప్రధానంగా ఏపీజీవీబీ బ్యాంకు తెలంగాణ గ్రామీణబ్యాంకుగా మారడంతో ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మార్పుతో కొందరు రైతులకు జమ కాలేదు. వాస్తవానికి ప్రభుత్వం అర్హత ఉన్న రైతులందరికీ నిధులు మంజూరు చేసింది. కానీ సాంకేతిక సమస్యలతో కొందరు రైతులకు రైతు భరోసా అందలేదు. దీనికితోడు జిల్లాలో క్రాప్‌సర్వేలో కొందరికి పట్టాభూములున్నా అవి సాగులో లేకపోవడం, రియల్, బంజర భూములుగా ఉండడంతో వ్యవసాయాధికారులు ఆయా భూములను ఖాళీ భూములుగా గుర్తించారు. అటువంటి భూములకు కూడా ఈసారి రైతుభరోసాలో నిధులు కేటాయించలేదు.

గతేడాది క్రాప్‌సర్వేలో పంటలు వేసి సాగుచేస్తున్న రైతుల భూములకు మాత్రమే రైతుభరోసా వచ్చింది. వరుసగా మూడేళ్లపాటు సాగులో లేకుండా బీడుగా ఉన్న భూములను సాగు భూములుగా గుర్తించడంలేదు. పాసు పుస్తకం ఉన్నా పంటలు వేయకపోవడంతో రైతు భరోసా ఇవ్వడంలేదు. అలాగే జిల్లాలో కొత్తగా 4,692మంది రైతులు పాసుపుస్తకాలు పొందారు. వీరు కూడా రైతుభరోసాకు దరఖాస్తు చేశారు. ఈ కొత్త పాసుపుస్తకాలు ఇంకా పరిశీలన దశలోనే ఉన్నాయి. ఈ రైతులకు కూడా రైతుభరోసా అందాల్సి ఉంది. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 1,88,074మంది రైతులకు రూ.322.98కోట్లు పైగా రైతు భరోసా మంజూరైంది. ఇందులో 1,77,774మంది రైతులకు రూ.317.16కోట్లు రైతుల ఖాతాల్లో జమయయ్యాయి. మిగిలిన అకౌంట్లకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం అప్‌డేట్ కాకపోవడం, కొన్ని ఏఈవోల స్థాయిలో పరిశీనలతో ఉండడంతో వాటికి జమచేయాల్సి ఉంది. వాస్తవానికి ప్రభుత్వం సాగు చేస్తున్న రైతులందరికీ రైతుభరోసా మంజూరు చేస్తూ ట్రెజరీలకు పంపింది. కాని సాంకేతిక కారణాలతో ట్రెజరీల నుంచి కొందరు రైతులకు బదిలీ కాలేదు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు తమ ఖాతాలను తిరిగి పునరుద్ధరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో ఆయా రైతులు బ్యాంకు, వ్యవసాయాధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు.



లెక్కించిన నగదును బ్యాంకు అధికారులకు అందజేస్తున్న దృశ్యం

51రోజులు.. రూ.1.97కోట్లు

రికార్డు స్థాయిలో భద్రాద్రి రామయ్య హుండీ ఆదాయం

భద్రాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా ఈసారి రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. హుండీ లెక్కింపులో గడిచిన 51 రోజులకు గాను రూ.1,97,79,049 ఆదాయం లభించింది. ఆలయ ఆవరణలోని చిత్రకూట మండపంలో గురువారం ఆలయ హుండీలను తెరిచి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. ఇందులో రూ.1,97,79,049 నగదు, 65 గ్రాముల బంగారం, 1,500 గ్రాముల వెండి లభించింది. కాగా ఆలయ హుండీలను చివరగా మే 6న లెక్కించగా, 51 రోజుల అనంతరం గురువారం లెక్కింపు నిర్వహించారు. చివరిసారిగా మే 6న హుండీ లెక్కింపు నిర్వహించగా ఆనాడు శ్రీరామనవమి హుండీ ఆదాయం రూ.1,76,00,347 రాగా ఈసారి వేసవి సెలవుల్లో రూ.20 లక్షలు అదనంగా రావడం విశేషం. అలాగే 1,689 యుఎస్ డాలర్లు, థాయ్‌లాండ్ బట్స్ 580, సింగపూర్ డాలర్లు 50, మలేషియా రింగెట్స్ 20, నేపాల్ రూపీస్ 10, ఐర్లాండ్ పౌండ్స్ 15, ఇంగ్లాండ్ పౌండ్స్ 15, వియత్నాం డాంగ్స్ 5,000 లభించాయి.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా
ఇందిరాగాంధీ పాలన

- 'ఎమర్జెన్సీ' నాటి దారుణాలను ఈ తరానికి చెప్పేందుకే జిల్లా యాత్రలు
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్

ఖమ్మం, జూన్ 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఎమర్జెన్సీ కాలంలో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ ఎన్నో దారుణాలకు పాల్పడ్డారని, లక్షలాది మందిని జైళ్లలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఆనాటి దారుణాలను నేటి తరానికి తెలియజెప్పేందుకే బీజేపీ జిల్లా యాత్రలు చేపట్టిందని తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఆనాటి కాంగ్రెస్ పాలన సాగిందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో "భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు" పేరుతో ఏర్పాటు చేసిన సెమినార్‌లో పాల్గొనేందుకు గురువారం విచ్చేసిన ఎంపీ ఈటల ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను ఆనాడు కాంగ్రెస్‌పార్టీ ఎంతో అవమానించిందన్నారు. ఎన్నికల్లో కూడా ఆయన్ను ఓడించారని గుర్తు చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ఎమర్జెన్సీ విధించడంతో పాటు పత్రికా స్వేచ్ఛను, భావప్రకటనా స్వేచ్ఛను ఇందిరా గాంధీ హరించారని, ఎంతోమందిని జైళ్లకు పంపారన్నారు. నాటి ఎమర్జెన్సీ పాలన ప్రజలకు (మిగతా 6వ పేజీలో)

జిల్లా ఆస్పత్రిలో
సౌకర్యాల కల్పనకు కృషి

- మెడికల్ కళాశాలలో సదుపాయాలు పెంచాలి
- లాపరోస్కోపీ, రోబోటిక్ సర్జరీలపై శిక్షణ
- ఎంసీహెచ్‌లో మరో అంతస్థుకు ప్రతిపాదనలు పంపాలి
- ఆస్పత్రిలో కార్డియాలజీ డాక్టర్‌ను కొనసాగించాలి
- రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరేందర్‌కుమార్
- ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు



ఖమ్మం మెడికల్ కాలేజీని తనిఖీ చేస్తున్న రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరేందర్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): "ఖమ్మం మెడికల్ కళాశాలలో ఇంకా సదుపాయాలు పెంచాలి.. చిన్నచిన్న లోపాలు ఉన్నాయి.. అయినా ఓకే.. బావుంది." అంటూ రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ నరేందర్‌కుమార్ కితాబునిచ్చారు. అయితే జిల్లా జనర్ ఆస్పత్రి వాతావరణం రోగులకు ఆహ్లాదాన్ని పంచేలా లేదని ఇంకా సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు జిల్లా ఆస్పత్రిని ఆయన గురువారం సందర్శించి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ ఉన్నారు. తొలుత ఆయన మెడికల్ కళాశాలలో ల్యాబులు, హెమటాలజీ బయోకెమిస్ట్రీ ల్యాబులు, డిసెక్షన్, తరగతి గదులను పరిశీలించారు. మెడికల్ కళాశాలలో పూర్తిగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. విద్యార్థులకు కిచెన్‌లో ఆర్వో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లే గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థులను ఆర్టీసీ బస్సుల్లోనే అధ్యయనానికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ లైబ్రరీని ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని 4 యూపీహెచ్‌లు, రీజనల్ హాస్పటల్‌గా కల్పించేదుకు డీహెచ్‌కు అనుమతికి పంపించినట్లు తెలిపారు. మెడికల్ కాలేజీలో కానీ, ఆస్పత్రిలో కానీ సిబ్బంది అవసరం అయితే తక్షణమే భర్తీ చేసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. మొత్తంగా మెడికల్ కళాశాలలో వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా ఆస్పత్రిలో రెండు గంటల పాటు తనిఖీ..

అనంతరం జిల్లా ఆస్పత్రిలో డీఎంఈ నరేందర్‌కుమార్ రెండు గంటల పాటు తనిఖీ చేశారు. వార్డులు, ఎంఎంసీ, కార్డియాలజీ, డయాలసిస్, మెడికల్ వార్డులను ఆయన పరిశీలించారు. క్యాజువాలిటీలో సిబ్బంది విధులను పరిశీలించారు. ఎంసీహెచ్‌లో పిల్లల వార్డు, గర్భిణులను పరిశీలించే విభాగాలను ఆయన పరిశీలించారు. ఎంసీహెచ్‌లో మరో అంతస్తును నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఆస్పత్రిలో, కాలేజీలో ఐటీ విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. రోగులకు వంట వండే ప్రాంతంలో ఆర్వో ఫిల్టర్‌ను ఏర్పాటు చేయాలని, వంటగది విడిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్డియాలజీ విభాగంలో రోగులు, ఔట్ పేషంట్ల పరిస్థితిపై అక్కడి రోగులతో మాట్లాడగా కార్డియాలజీ వైద్యుడి డిప్యూటేషన్ రద్దు చేశారని చెప్పారు. దాంతో తక్షణమే స్పందించిన డీఎంఈ (మిగతా 6వ పేజీలో)



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బూర్గంపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో
ఏసీబీ సోదాలు

- వరుస ఫిర్యాదుల నేపథ్యంలో రికార్డుల పరిశీలన
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ రమేష్

6

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా
తొలుత గళం విప్పింది మేమే

- నక్సలైట్లు చర్చలకు వస్తామన్నా నరమేథాన్ని కొనసాగిస్తున్నారు
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

ఖమ్మం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కార్పోరేట్ ప్రభుత్వాలను నమ్ముకుంటే మావోయిస్టులను చంపినట్లే ప్రజలను కూడా చంపుతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఖమ్మం రూరల్ మండల సీపీఐ మహసభను గురువారం ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా తొలుత గళం వినిపించింది సీపీఐ పార్టీ మాత్రమేన్నారు. మావోయిస్టులు చర్చలకు వస్తామన్నా ప్రభుత్వాలు నరమేధాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. మావోయిస్టులు వనం వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేపదే రైతు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. ఏపీలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అధికారం కోసం బీజేపీ వద్ద (మిగతా 6వ పేజీలో)

అప్రమత్తతే ప్రాణం కాపాడుతుంది

- వర్షాకాలంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- రైతులు, గృహ వినియోగదారులకు విద్యుత్ శాఖ అవగాహన

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విషయంలో రైతులు, పరిశ్రమల వినియోగదారులు, ప్రజలు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభం కావటంతో విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యవసాయ మోటార్లు ఆన్ చేసేందుకు వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లిన రైతుల నుంచి ఇళ్లలో దండెంపై దుస్తులు ఆరబెట్టే మహిళల వరకు తరుచూ విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ఆంధ్రజ్యోతి కథనం...

ప్రమాదాలకు అవకాశం ఉండే అంశాలు

రైతులు, వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సొంతంగా విద్యుత్‌కు సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితులో చేయకూడదు. ఎలక్ట్రీషియన్‌ను పిలిపించి అతని ద్వారానే మరమ్మతు పనులు చేయించాలి. విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు తడి భూమి, నీరులో ఉంటే ఆ ప్రాంతంలోకి వెళ్లకూడదు.

- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు. ప్రమాదకరంగా ఉంటే వెంటనే 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలి.
- నివాసాల్లో దుస్తులు ఆర బెట్టే దండెం, వైర్లు, విద్యుత్ మీటర్లు, తీగలకు తాకకుండా చూసుకోవాలి, విద్యుత్ తీగలు తాకితే విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయి. సాధ్యమైన మేరకు ప్లాస్టిక్ దండెం వైర్లు వాడటం శ్రేయస్కరం.
- నివాసాల ముందు పందిరి ఏర్పాటు చేసుకున్న రేకులపై విద్యుత్ తీగలు తగిలితే ఇంటి మొత్తానికి విద్యుత్ ప్రమాదం జరుగుతుంది. విద్యుత్‌స్తంభాల నుంచి సరఫరా జరిగే విద్యుత్ తీగలు నివాసాల ముందు రేకులకు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నివాసాల్లో వైరింగ్ నాణ్యతను, బోర్డులు, స్విచ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. అజాగ్రత్తగా ప్లగ్గుల్లో తీగలు పెట్టటం వంటివి చేయకూడదు.
- ఎవరికైనా విద్యుత్ ప్రమాదం జరిగితే వారిని కాపాడేందుకు నేరుగా తాకకూడదు. కర్ర లేదా ప్లాస్టిక్ వస్తువులతో రక్షించే ప్రయత్నం చేయాలి. విద్యుత్ సరఫరాను నిలిపివేసేందుకు ప్రయత్నించాలి.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం...

ఇనుగుర్తి శ్రీనివాసాచారి, పర్యవేక్షక ఇంజనీరింగ్ అధికారి



వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ వినియోగదారులకు క్షేత్రస్థాయిలోని విద్యుత్ లైన్‌మ్యాన్‌లు, లైన్ ఇన్స్‌పెక్టర్లు, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇంజనీర్‌లు అందుబాటులో ఉంటారు. ఎటువంటి విద్యుత్ సమస్యలైనా, అత్యవసర విద్యుత్ సేవలకైనా 1912 నెంబర్‌కు వినియోగదారులు కాల్ చేయాలి. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయటం చట్టరీత్యానేరం. విద్యుత్ సిబ్బందికి తెలియకుండా ప్రజలు విద్యుత్ సరఫరా వ్యవస్థలను తాకకూడదు.

తెరుచుకున్న మూత బడులు

- 64 పాఠశాలల్లో 15 ప్రారంభం
- ప్రభుత్వ ఆదేశాలతో ప్రారంభించిన అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో గత 5 సంవత్సరాలుగా విద్యార్థులు లేరని మూతపడిన కొన్ని ప్రభుత్వ పాఠశాలలను 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాలతో ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులు లేరనే నేపంతో జిల్లా వ్యాప్తంగా 64 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు. ఉపాధ్యాయులను దగ్గరిలోని మరో పాఠశాలకు డిప్యుటేషన్ పేరుతో మార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను విడతలవారీగా ప్రారంభించాలని ఆదేశాలు జారీచేశారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో మూతపడిన 64 పాఠశాలల్లో ప్రస్తుతం 15 పాఠశాలలను ఈ ఏడాది బడిబాట కార్యక్రమంలో పునః ప్రారంభించారు. వాస్తవానికి ప్రతి గ్రామంలో సుమారు 10 నుంచి 20 వరకు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉంటారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా సంబంధిత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న పథకాల గురించి వివరించాలి. కానీ కేవలం వేసవి సెలవుల అనంతరం వారం రోజులు బడిబాట పేరుతో మమ అనిపించి విద్యార్థులు లేరనే నెపంతో పాఠశాలలను మూసివేయటంతో ఆయా గ్రామాల పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం విద్యాశాఖ అధికారుల తప్పిదమే. కాగా ఏజెన్సీ ప్రాంతాలతోపాటు మారుమూల ప్రాంతాలలోని కొందరు ఎంఈవోలు ఆయా మండలాల పరిధిలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు వెళ్లేలా సహకరిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. కారణం ఆయా ప్రాంతాలలో పని చేస్తున్న కొందరు ఉపాధ్యాయులు సమయపాలనకు పాఠశాలలకు రాకపోవటంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రావటం మానేశారని, సమయాపాలనకు రాని ఉపాధ్యాయులపై సంబంధిత ఎంఈవోలు చర్యలు తీసుకోకుండా ఉండటానికి కారణం వారి వద్ద నుంచి కొందరు విద్యాశాఖ అధికారులు ఎంతో కొంత నెలవారి మామూళ్లు తీసుకుంటున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. ఇది జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం వెనుక మతలబు ఏమిటో అర్థంకాని పరిస్థితి. కేవలం విద్యాశాఖ అధికారుల కారణంగానే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో మూత పడి ప్రారంభమైన పాఠశాలలు

గతేడాది వరకు విద్యార్థులు లేరని మూసివేసిన పాఠశాలలను 2025-26 విద్యా సంవత్సరంలో 15 పాఠశాలలను ప్రారంభించిన అధికారులు. వాటి వివరాలను వెల్లడించారు.



కల్లూరు మండలం ఓబులరావు బంజర పాఠశాలలో విద్యార్థులు

ఏన్కూర్ మండలం ఎంపీపీఎస్ రాజుపాలెం ప్రస్తుతం 21 మంది విద్యార్థులు, కల్లూరు మండలం ఎంపీపీఎస్ ఓబులరావు బంజర, ప్రస్తుతం 31 మంది విద్యార్థులు, కల్లూరు మండలం ఎంపీపీఎస్ విశ్వనాథపురం విద్యార్థులు 6, కల్లూరు మండలం ఎంపీపీఎస్ పాయాపుర్ విద్యార్థులు 9 మంది, కల్లూరు మండలం ఎంపీయూపీఎస్ లక్ష్మీపురం 14 మంది, ఖమ్మం రూరల్ మండలం ఎంపీపీఎస్ దక్యతండ 8 మంది, ఖమ్మం అర్బన్ మండలం ఎంపీపీఎస్ రుద్రమ్మకోట 24 మంది, పెనుబల్లి మండలం ఎంపీపీఎస్ చిన్యాతండ 10 మంది, పెనుబల్లి మండలం ఎంపీయూపీఎస్ రామచంద్రారావు బంజర 10 మంది, రఘునాథపాలెం మండలం (నూతనంగా ఈ ఏడాది ప్రారంభం) పువ్వాడ ఉదయ్‌నగర్ 40 మంది, సింగరేణి మండలం ఎంపీపీఎస్ కొత్త తండ ఆరుగురు, వైర మండలం ఎంపీపీఎస్ గౌండ్లపాలెం ఏడుగురు, తల్లాడ మండలం ఎంపీపీఎస్ మంగాపురం నలుగురు, కూసుమంచి మండలం ఎంపీపీఎస్ ఒంటిగుడిసె తండ కేవలం ఒక్క విద్యార్థి, ఎర్రుపాలెం మండలం ఎంపీపీఎస్ చొప్పకట్లపాలెం నలుగురు విద్యార్థులు చేరారు. మొత్తం 15 పాఠశాలల్లో 195 మంది విద్యార్థులు చేరారు. కాగా గత 2 నుంచి 5 సంవత్సరాలు విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాలలు ఎందుకు ప్రారంభించలేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను నిలదీసినట్లు సమాచారం.

ప్రభుత్వ నిర్ణయం మేరకే పాఠశాలలు పున:ప్రారంభం

కె.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఖమ్మం,

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, తండాలలో ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని, పాఠశాలలు లేకుండా గ్రామాలు ఉండద్దు అనే ప్రభుత్వ లక్ష్యంతో ఖమ్మం జిల్లాలో మూతపడి ఉన్న 15 ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వ ఆదేశాలతో ప్రారంభించాం. ఆయా గ్రామాలకు జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రైవేటు పాఠశాలలకు పంపొద్దని వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేశాం. అందుకు తల్లిదండ్రులు సహకరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అంగీకరించారు. మొత్తం 64 పాఠశాలలు మూత పడి ఉండగా మొదటి దశలో 15 పాఠశాలలను ప్రారంభించాం. మిగిలిన పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రారంభిస్తాం. అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచిత సౌకర్యాలను వచ్చే ఏడాది పాఠశాలలు ప్రారంభం నాటికి వివరించేలా చర్యలు తీసుకుంటాం.

జిల్లా డీఐఈవో సేవలు ప్రశంసనీయం

ప్రశంసాపత్రాన్ని అందజేసిన ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్

భద్రాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ కళాశాలల్లో మెరుగైన నిర్వహణ, మంచి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన జిల్లా ఇంటర్మీడియట్ డీఐఈవో హసవత్ వెంకటేశ్వరరావును ఇంటర్ విద్యా కమిషనర్ కృష్ణ ఆదిత్య ప్రశంసించారు. హైదరాబాద్‌లో డీఐఈవోలతో జరిగిన సమావేశంలో కమిషనర్ చేతుల మీదుగా జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచడానికి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి డీఐఈవో చేస్తున్న కృషిని కమిషనర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు సంపత్‌కుమార్, పద్మావతి, స్వరూప, ఉమాలక్ష్మి, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

ఉద్దీపకం-2 వర్క్ బుక్ ముద్రణకు సిద్ధం

భద్రాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రతిభ సామర్థ్యానికి ఉపయోగపడేలా రూపొందించిన ఉద్దీపకం వర్క్‌బుక్-2 ముద్రణకు రంగం సిద్ధమైంది. 13,206 మంది విద్యార్థులకు 30,89,784 పేజీలను ముద్రించి సరఫరా చేసేందుకు స్వల్పకాలిక టెండర్లను కోరుతున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఈనెల 28 సాయంత్రం లోపు టెండరు ఫారాలను భద్రాచలం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కార్యాలయంలో సమర్పించాలి. ఉద్దీపకం-1 సత్ఫలితాలను ఇవ్వడంతో మలివిడతగా ఉద్దీపకం వర్క్‌బుక్-2ను ముద్రించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పుస్తక రచన పూర్తి కాగా ముద్రణ చేపట్టి జూలైలో విద్యార్థులకు అందించేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలి

- ఇంకుడుగుంతల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి
- డీపీవో చంద్రమౌళి

జూలూరుపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపించడంతో గ్రామాలలో అపరిశుభ్రత నెలకొనకుండా పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని డీపీవో చంద్రమౌళి సూచించారు. గురువారం సాయంత్రం ఆయన మండలంలోని వెంగన్నపాలెం, జూలూరుపాడు పంచాయతీలను సందర్శించారు. వెంగన్నపాలెంలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని, జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించారు. కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టేందుకే ఇంకుడుగుంతల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో మురికినీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలని అన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో, పారిశుధ్య పనులను చేపట్టడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో తులసీరాం, ఈజీఎస్ మండల ఏపీవో రవి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సోలార్ మోడల్ హౌస్‌ను ప్రారంభించిన సింగరేణి డైరెక్టర్లు

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సోలార్ మోడల్‌హౌస్‌ను గురువారం సింగరేణి డైరెక్టర్లు ప్రారంభించారు. రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన సోలార్ మోడల్ హౌస్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణ రావు, ఎల్‌వీ. సూర్యనారాయణ, కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో సోలార్ విద్యుదుత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు ఎం.షాలెం రాజు, జీఎంఎస్ జానకీరాం, జేసురత్నం, యూనియన్ నాయకులు జక్కుల గట్టయ్య, ఎండీ.రజాక్, అధికారులు జీవీ. కోటిరెడ్డి, సూర్యనారాయణరాజు, రామకృష్ణ, సుమలత, మోహన్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సోలాల్ మోడల్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఇదెక్కడి న్యాయం?

- నిందితులకు పోలీసు ఉన్నతాధికారి కొమ్ము కాస్తారా?
- న్యాయం కోసం సీఎం, డీజీపీలను కలుస్తాం
- ఎన్ఆర్ఐ భార్య శ్రావ్య, తల్లిదండ్రులు

ఇల్లెందు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): "తల్లిదండ్రులు ఆడపిల్లలను కనడమే నేరమా.. నా భర్త అన్యాయం చేస్తున్నాడని వేధింపులకు గురిచేశాడని న్యాయం చేయమని కోరితే పోలీసు ఉన్నతాధికారి ఒకరు నిందితులకే కొమ్ముకాస్తున్నాడు." ఏకంగా కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తూ విచారణ చేస్తున్న పోలీసు సీఐని సస్పెండ్ చేయడం ఏంటని ఎన్నారై భార్య దుబ్బాక శ్రావ్య ప్రశ్నించింది. కౌన్సిలింగ్‌లకు రాకుండా తప్పించుకుంటున్న తన భర్త పెండ్లి నవీన్‌రెడ్డిని అమెరికా నుంచి రప్పించాలని తనకు న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన ఎన్ఆర్ఐ పెండ్లి నవీన్‌రెడ్డి ఆయన భార్య శ్రావ్యల మధ్య తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తమను వేధించాడని ఎన్ఆర్ఐ నవీన్‌రెడ్డి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సీఐను సస్పెండ్ చేసిన విషయం విధితమే.. ఈ నేపథ్యంలో ఇల్లెందు పోలీసు స్టేషన్‌కు గురువారం కూడా తల్లిదండ్రులు బంధుమిత్రులతో వచ్చిన బాధితురాలు శ్రావ్య విలేకరులతో మాట్లాడుతూ తనను కాపురానికి తీసుకెళ్లాలని అత్తింటి వారిని అనేక పర్యాయాలు ప్రాధేయపడ్డానంది. తనకు సంతానం కలగడం లేదని, తనలో లోపం ఉందంటూ తనతోటి కోడలు, బావ హరీశ్‌రెడ్డి ఆసుపత్రులకు, ఫెర్టిలిటీ సెంటర్లకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారని, తనలో ఎలాంటి లోపం లేదని భర్తకు పరీక్షలు నిర్వహించాలని వైద్యులు సూచిస్తే నవీన్‌రెడ్డికి వైద్యపరీక్షలు చేయించకుండా అత్తింటివారు తనపైనే నిందలు వేస్తూ మానసిక క్షోభకు గురిచేశారని తెలిపింది. "తన కొడుకు ఇండియాకు రాడు. అతనికి ఏ లోపం లేదు.. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి.. మాకు ఐజీ అండగా ఉన్నాడు" అని తన మామ ఉపేందర్‌రెడ్డి తమపైనే బెదిరింపులకు పాల్పడుతున్నారని శ్రావ్య ఆరోపించింది.



విలేకరులతో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ భార్య దుబ్బాక శ్రావ్య,ఆమె తల్లిదండ్రులు

శ్రావ్య తండ్రి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన కూతురిపై జరుగుతున్న వేధింపులు, నిందారోపణలపై 20 రోజుల క్రితం కొత్తగూడెంలో ఎస్పీకి ఫిర్యాదు చేశామని దాంతో ఆయన ఇల్లెందు పోలీసు స్టేషన్‌కు పంపారని తెలిపారు. ఇల్లెందులో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో షీటీంలు కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తున్నాయని, భర్త నవీన్‌రెడ్డి కూడా ఈ నెల 25న కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని చెప్పినట్లు ఆయన తెలిపారు. ఐతే కౌన్సిలింగ్‌కు రాకపోగా సీఐ సత్యనారాయణ తన తల్లిదండ్రుల పట్ల అమర్యాదగా ప్రవర్తించాడంటూ నవీన్‌రెడ్డి ఫిర్యాదు చేస్తే పోలీసు ఐజీ ఇల్లెందు సీఐని సస్పెన్షన్ చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కౌన్సిలింగ్ సమయంలో షీటీంలు సైతం ఉన్నాయని, తాము న్యాయం కోసం 20 రోజులుగా పోలీసు స్టేషన్ల చుట్టూ, పోలీసు అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమ గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు.

మోసపోయిన తమకు న్యాయం చేయలేదని, కానీ నవీన్‌రెడ్డి తన తల్లిదండ్రులకు అవమానం జరిగిందంటూ ఫిర్యాదు చేస్తే పోలీసు ఐజీ ఏకంగా సీఐని సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. తన కూతురు శ్రావ్యకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, పోలీసు డీజీపీలను కలుస్తామని ఆయన తెలిపారు. వేధింపులకు గురిచేసిన తన భర్తను అమెరికా నుంచి రప్పించాలని, అత్తమామలు, తోటి కోడలు, భావలను అరెస్టు చేయాలని బాధితురాలు శ్రావ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఇందిరాగాంధీ పాలన

(5వ పేజీ తరువాయి)

తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రాజ్యాంగ పుస్తకాలను పట్టుకుని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, మోసాలు చేసి అధికారంలోకి రావడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని విమర్శించారు. రాష్ట్రంలో 50 ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమ ముఖ్యమంత్రుల విషయంలో సామాజిక న్యాయం ఎందుకు పాటించలేదని, ఎందుకు రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకోలేకోయారని చెప్పే దమ్ము, ధైర్యం కాంగ్రెస్ పార్టీకి ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక సామాజిక న్యాయం జరుగుతోందని, దేశానికి రాష్ట్రపతులుగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి అవకాశం ఇచ్చారని, ప్రధానిగా ఒక బీసీ నేత ఉన్నారని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా ఆయా సామాజిక వర్గాలకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ పాలనలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేసుకుని సామాజిక న్యాయం పాటిస్తూ పరిపాలన సాగుతోందన్నారు. మహిళలకు కూడా సముచిత గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా వివక్ష లేదన్నారు. అన్నిపార్టీల ప్రభుత్వాలను గౌరవించి నిధులు కేటాయించిందని, ఇదే విషయాన్ని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని చెప్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇళ్లు నిర్మించినా కేంద్రం పేదవారికి ఇళ్లు నిర్మించేందుకు ఇచ్చే గ్రాంటును ఎక్కడా ఆపబోదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పథకానికి ఏ పేర్లు పెట్టుకున్నా పేదలకు ఇళ్లు నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ విధానమని తెలిపారు. పేదలకు రేషన్ బియ్యం కూడా కేంద్రమే ఇస్తోందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా కులగణన చేపడుతున్నారని, ప్రజల్లో కులగణన చేయాలన్న డిమాండ్ వచ్చినందున ఆయా రాష్ట్రాల్లో ఉన్న జనాభాలో కులాలవారీగా లెక్కలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. అయితే కొన్ని రాష్ట్రాల్లో కొన్ని కులాలు ఓసీ, బీసీ, ఎస్సీ ఎస్టీలుగా గుర్తింపు పొంది ఉన్నాయని, ఆయన గుర్తుచేశారు. అయినా సామాజిక న్యాయమే లక్ష్యంగా ఆయా కులాలకు అవకాశాలు కలిపించాలన్నది కేంద్ర ప్రభుత్వ విధానమని తెలిపారు. స్థానిక సంస్థలతో పాటు చట్టసభల్లోనూ జనాభా నిష్పత్తి ప్రకారం ఆయావర్గాలకు రిజర్వేషన్లు కేటాయించాలన్న చర్చ దేశంలో నడుస్తోందని గుర్తు చేశారు.

ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఈటల రాజేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖమ్మం నగర పరిధిలోని జర్నలిస్టులకు కేటాయించిన 24ఎకరాల భూమిలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. జర్నలిస్టులకు నేటి వరకు ఈ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులు బిజినెస్‌మెన్‌లు కాదని, ఎక్కువ మంది కలాన్ని కలాన్ని నమ్ముకొని ఉద్యోగాలు చేస్తున్నవారే ఉన్నారన్నారు. కొందరు మాత్రమే కలాన్ని అమ్ముకొని బెదిరింపులకు పాల్పడేవారు ఉంటారన్నారు. ఎన్నో ఇబ్బందులతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు వెంటనే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు తాండ్ర వినోదరావు, నున్నా రవికుమార్, దేవకి వాసుదేవరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, రుద్రప్రదీప్, దొంగల సత్యనారాయణ, విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో క్రీడలకు ప్రోత్సాహం

- స్పోర్ట్స్ పాలసీ అమలుకు కార్యాచరణ
- స్పోర్ట్స్ స్కూల్‌లో బంగారు భవిష్యత్తు: శాట్స్ పరిశీలకుడు బి.రాంబాబు



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో క్రీడలకు మరింత ప్రోత్సాహం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్స్ (శాట్స్) ఫుట్ బాల్ శిక్షకుడు, స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల భద్రాద్రి జిల్లా ఎంపికల పరిశీలకులు బి.రాంబాబు స్పష్టం చేశారు. గురువారం కొత్తగూడెం ప్రకాశం మైదానంలో నిర్వహించిన స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి ఎంపికలకు పరిశీలకులుగా రాంబాబును శాట్స్ నియమించగా ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి , శాట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.సోనిబాలా దేవి ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందన్నారు. అమలులో ఉన్న రెండు శాతం స్పోర్ట్స్ రిజర్వేషన్‌ను పెంచేలా పరిశీలిస్తున్నారని, క్రీడలతో పాటు క్రీడాకారులకు ప్రోత్సాహంగా స్పోర్ట్స్ పాలసీని రూపొందిస్తున్నట్లు తెలిపారు. మండల, జిల్లా కేంద్రాలలో క్రీడా మైదానాల అభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహాలు స్థానిక జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇక వేగవంతం కానున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జరుగుతున్న క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశాల ఎంపికలకు విశేష స్పందన లభిస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో ప్రభుత్వ క్రీడా పాఠశాలలైన హకీంపేట్, కరీంనగర్, అదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 33 జిల్లాల నుంచి 660 మంది బాల, బాలికలు రాష్ట్ర స్థాయిలో పాల్గొననున్నట్లు తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే, ప్రతిభ కలిగిన 120 మంది బాల, బాలికలను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వీరికి ప్రస్తుతం ఇంటర్మీడియట్ వరకు విద్యను అందిస్తున్నారని, రాబోయే రోజుల్లో గ్రాడ్యుయేషన్ వరకు కొనసాగించే పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

నఖిలీ విత్తనాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కనకయ్య

మణుగూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మణుగూరు సబ్ డివిజన్‌లో నఖిలీ విత్తనాలను అరికట్టాలని వాటిని విక్రయిస్తున్న షాపు యజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పల్లపు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో కల్తీ విత్తనాలు జోరుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. అటువంటి వారిపై కఠిన చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు తరుచుగా ఫెర్టిలైజర్ షాపులను తనికీ చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి సాంబశివరావు, నాయకులు కొడిశాల రాములు, పిట్టల నాగమణి, దోమల లెనిన్ బాబు, కొండ్రు గౌరి, ఉప్పతల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు



బూర్గంపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనీఖీలు చేపట్టారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బూర్గంపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై చాలా కాలంగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనీఖీలు చేపట్టినట్లు తెలిపారు. తాము కార్యాలయానికి చేరుకునే సమయానికి ఆఫీసులో ప్రైవేటు వ్యక్తులు ఉండటం, అలాగే ఆన్‌లైన్ ద్వారా నగదు లావాదేవీలు గుర్తించినట్లు తెలిపారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్నామని, వాటిపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు చట్టబద్ధంగా చేయాల్సిన పనికి ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, అధికారిక నంబర్ 9154388981కు ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టబద్ధంగా జరగాల్సిన పని అయితే బాధితులకు తప్పనిసరిగా ఏసీబీ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 21తేదీన జరిగిన ఏసీబీ దాడులను మరువక ముందే గురువారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడంతో మిగిలిన శాఖల అధికారులు ఉలిక్కిపడినట్లు తెలుస్తోంది. ఐదురోజుల వ్యవధిలో రెండుసార్లు ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు కృషి

(5వ పేజీ తరువాయి)

కార్డియాలజీ వైద్యుడిని ఇక్కడే కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆపరేషన్లకు లాపరోస్కోపీ పరికరాలను వినియోగించేందుకు సదుపాయాలు కల్పించనున్నట్లు డీఎంఈ తెలిపారు. అంతే కాకుండా రోబోటిక్ సర్జరీలపై వైద్యులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ సర్జరీలకు వినియోగించేందుకు సీఆర్మ్ పరికరాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. డీఎంఈ వెంట ఖమ్మం జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతీబాయి, మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సృజన, డాక్టర్ సరిత, ఆర్ఎంవోలు డాక్టర్ రాంబాబు, డాక్టర్ వినాయక్‌రాథోడ్, డిప్యూటీ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ బి కిరణ్‌కుమార్ వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా తొలుత గళం విప్పింది మేమే

(5వ పేజీ తరువాయి)

మోకరిల్లుతున్నారని విమర్శించారు. చేగువీర అభిమానినని చెప్పుకునే పవన్ కల్యాణ్ ఆఖరికి కాషాయంలో కలిసిపోయాడని ఎద్దేవా చేశారు. మోసపూరిత పార్టీల వెంట వెళతారా.. మంచి చేసే పార్టీకి అండగా ఉంటారా ప్రజలు తేల్చుకోవాలన్నారు. కమ్యూనిస్టులంతా ఒక్కటై ఢిల్లీ ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరవేయాలన్నారు. తమ పొత్తు పేద ప్రజలతోనే ఉంటుందన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ మహసభ నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో గతప్రభుత్వం చేసిన తప్పిదాలతో విధ్వంసం జరిగిందన్నారు. అందుకే గత పాలకులు ప్రజాగ్రహానికి గురయ్యారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యిందని, ఇక రేవంత్ సర్కార్ తన సమర్థతను చాటుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో సీపీఐ లేకుంటే కుదరదనే భావన వచ్చేలా కామ్రేడ్స్ పని చేయాలన్నారు. సీపీఐకి ఖమ్మం రూరల్ మండలం కంచుకోటన్నారు. సభలో సీపీఐ రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు, మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, కర్ణకుమార్, జిల్లా నాయకులు పుచ్చకాయల కమాలకర్, లింగా వెంకటనారాయణ, శేషగిరిరావు, గౌస్ పాషా, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు రాంమూర్తి నాయక్, లలిత తదితరులు పాల్గొన్నారు.

రైతులను దివాలాతీయిస్తున్న ప్రభుత్వం

» మాజీ ఎంపీ సీతారాంనాయక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

ఇల్లెందు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతులను దివాలాతీయిస్తుందని మాజీ ఎంపీ సీతారాంనాయక్ విమర్శించారు. గురువారం ఇల్లెందు రాందేవ్‌బాబా ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మూడు దఫాలపాటు ఇవ్వాల్సిన రైతుల భరోసాను కేవలం ఒకే దఫా ఇచ్చి సంబరాలు చేయడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు గుగులోత్ రాంచంద్రనాయక్, మిర్యాల వెంకటేశ్వరరావు, గోపీకృష్ణ, ప్రహ్లాద్‌తివారి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు ఓసీ విస్తరణకు ప్రజామోదం



మాట్లాడుతున్న ఎస్‌డీసీ సుమ

మణుగూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మణుగూరు ఓసీ విస్తరణ కోసం గురువారం కొమ్ముగూడెం కమ్యూనిటీ హాల్‌లో గ్రామ పెద్దలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ నిర్వహించిన గ్రామ సభ విజయవంతం అయింది. ఓసీ విస్తరణకు తమ భూములను ఇచ్చేందుకు ప్రజల నుంచి ఆమోదం లభించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు ఇస్తామనడంతో గ్రామ సభలో మాకేమి అభ్యంతరం లేదంటూ చేతులెత్తి సమ్మతం తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి సుమ మాట్లాడుతూ. మణుగూరు ఓసీ విస్తరణ భూసేకరణ ఆవశ్యకత, ప్రజా ప్రయోజనం గురించి గ్రామస్థులకు వివరించారు. ఎస్‌డిసీకి ఓసీ విస్తరణకు మా భూములు ఇచ్చేందుకు పూర్తి స్థాయిలో అంగీకరిస్తున్నామని చేతులెత్తి సభాముఖంగా ఆమెదం తెలుపుతూ సంతకాలు చేశారు. ఈ గ్రామ సభలో మణుగూరు మునిసిపల్ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో తేళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగమైన అపోలో ఫార్మసీ, భారత్ హ్యుందాయ్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు నేడు శుక్రవారం మోడల్ కెరీర్ సెంటర్ (ప్ర భుత్వ ఐటీఐ, టేకులపల్లి) ఖమ్మంలో జాబ్ మేళా నిర్వ హించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 110 ఉద్యోగాల భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నటు ఆమె తెలిపారు. 18నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గంలోకి

ఖమ్మం జిల్లా నేతలు







జైపాల్, బాలకృష్ణను అభినందిస్తున్న రాష్ట్ర టీఎన్జీవో నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గంలోకి ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు అవకాశం కలిగింది. హైదరాబాద్ నాంపల్లి టీఎన్జీఓ భవన్‌లో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన టీఎన్జీఓ నాయకులు గంగవరపు బాలకృష్ణ, జేడీ జైపాల్‌ని రాష్ట్ర కార్యవర్గంలోకి ఎంపిక చేశారు. గతంలో వీరు ఖమ్మం జిల్లా కార్యవర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గం లో కీలక పదవులు ఇచ్చి ఖమ్మం జిల్లాకు ప్రాధాన్యత కల్పించినదుకు ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు,కొణిదెన శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర సంఘ అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్, ముజీబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నికైన ఇద్దరు నేతలు పూర్తిస్థాయిలో ఉద్యోగులకు అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఏ ఉద్యోగుల పీఆర్సీకి సంబంధించి అనేక విషయాలు ఈ కార్యవర్గ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా టీఎన్జీవో నాయకులు కొమరగిరి దుర్గాప్రసాద్, యర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపికలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను నాలుగో తరగతిలో ప్రవేశాలకు కొత్తగూడెంలో జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు గురువారం నిర్వహించారు. భద్రాద్రి జిల్లాలో 23 మండలాల్లో మండల స్థాయి ఎంపికల కోసం మొత్తం191 మంది తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా జిల్లా పోటీలకు 125 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిలో 80 మంది బాల, బాలికలు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ జిల్లా స్థాయి ఎంపికలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ (శాట్జ్) హైదరాబాద్ నుంచి పరిశీలకులుగా బి.రాంబాబు పర్యవేక్షించారు. తొమ్మిది క్రీడా విభాగాల్లో జరిగిన ఈ ఎంపికల్లో ప్రదర్శన కనబరిచిన బాలురు-10, బాలికలు -10 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నామని భద్రాద్రి జిల్లా డీవైఎస్‌వో పరందామరెడ్డి తెలిపారు. ఈ క్రీడా ఎంపికల్లో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్‌కుమార్, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు భట్టు ప్రేమ్ కుమార్, స్టెల్లా, నాగలక్ష్మీ, మంగీలాల్, కవిత, డివైఎస్‌వో కార్యాలయ సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య, వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రాజు, డాక్టర్ రాకేష్, సిబ్బంది గంగాభవానీ, సోనియా, దేవి తదితరులు పాల్గొన్నారు.

30లోపు రేషన్ తీసుకోవాలి

» కొత్తగూడెం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుక్మిణిదేవి

కొత్తగూడెం అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్‌కార్డుదారులందరికి ఈనెల 1నుంచి 3నెలల రేషన్ కోటా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం అర్హులైన 297189మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికి 21,397వేల మెట్రిక్ టన్నుల మేర సన్న బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. గురువారం నాటికి 2,49,922మంది లబ్ధిదారులకు 17,994వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 5 ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా పంపిణీ చేశారు. జూన్, జులై, అగష్టు నెలల వేలిముద్రలను ఒకేసారి వేయాల్సి రావటంతో మూడు సార్లు తూకం వేస్తున్నారు. కొన్ని దుకాణాల్లో సాంకేతిక సమస్యలతో కొంతమేర అలస్యం జరుగుతుందని రేషన్ లబ్ధిదారులు, డీలర్లు చెబుతున్నారు. రేషన్‌కార్డుదారులందరూ ఈనెల 30లోపు రేషన్ బియ్యం తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారిణి రుక్మిణీదేవి సూచించారు. చౌక ధరల దుకాణాల డీలర్లు, డీఆర్‌డిపోల పంపిణీ ఉదయం, సాయంత్రం రెండు పూటల రేషన్ దుకాణాలు తెరిచి సరఫరా చేయాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందుబాటులో

వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు

» నాబార్డు సీజీఎం ఉదయ్ భాస్కర్

ఖమ్మం వ్యవసాయం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు అందుబాటులో ఉన్నాయని నాబార్డ్ సీజీఎం ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం ఖమ్మంలో బ్యాంకు అధికారులకు, అనుబంధ సంస్థలకు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, వ్యవసాయ వ్యవసాయేతర రుణాలు చాలా అందుబాటులో ఉన్నాయని రైతులకు వీటి మీద అవగాహన కల్పించి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ గణపతి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ జాంబ్రే, ఎస్బీఐ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, నల్గొండ డీసీసీబీ సీఈఓ శంకర్రావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్య రవీంద్రన్, వినయ్ కుమార్, సుజిత్ కుమార్, మేనేజర్ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీజీఎం ఉదయ్ భాస్కర్

ఓసీ ప్రాంతాల పరిశీలన



బొగ్గు ఖనిజాన్ని పరిశీలిస్తున్న గౌతమ్ పోట్రో

మణుగూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీ డైరెక్టర్ పా గౌతమ్ పోట్రో గురువారం మణుగూరు ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక జీఎం దుర్గం రామచందర్, లక్ష్మీపతి గౌడ్ రమేష్‌లు డైరెక్టర్ పాకు ఘన స్వాగతం పలికారు. ఏరియాలో ఓసీ-2 గని, మణుగూరు ఓసీ ప్రాంతాలను పా సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి గనులను పరిశీలించారు. అధికారులతో గనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ గనుల్లో ఉత్పత్తి అయ్యే బొగ్గు ఖనిజాల నాణ్యతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గనుల అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో

3.1 సెంటీమీటర్ల సగటు వర్షపాతం

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం సరాసరి 3.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు పలు ధఫాలుగా వర్షం కురిసింది. తుంపర్లు ,కొద్దిపాటి జల్లులకే వర్షం పరిమితం అయినప్పటికీ సాగులో ఉన్న పంటలకు ఎంతో కొంత దోహద పడింది.. వేంసూరు మండలంలో అత్యధికంగా 5.32 సెంటీమీటర్ల వర్షం కురవగా అత్యల్పంగా ఎర్రుపాలెం మండలంలో 6.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. వర్షం రాక కోసం అన్నదాతలు గత చాలా రోజులుగా ఆకాశం వంక ఆశగాచూస్తుండా కొద్దిపాటి వర్షం వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడింది. ఈఏడాది ముందస్తు ఖరీఫ్ ప్రారంభం అవుతుందని రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తాయన్న నమ్మకంతో రైతులు పత్తి, తదితర మెట్ట పంటలను విత్తారు. కాగా గతచాలా రోజులుగా వానలు జాడలేక పోవటంతో రైతులు నాటిన పత్తి, తదితర పైర్లు ఎండ తీవ్రతకు వాడి పోతున్నాయి. వానలు ముఖం చాటేసిన కారణంగాపైర్లు వాడి పోతుండటంతో రైతులు వాటిని బతికించేందుకు పలు విధాలుగా శ్రమిస్తున్నారు. కాగా రెండు రోజులుగా వాతావరణం చల్లబడటంతోపాటు కొద్దిపాటి వర్షం కురుస్తుండటంతో సాగులో ఉన్న పైర్లకు ఊరట లభించింది.. మరో వంక ఎండ తీవ్రత తగ్గటంతో సాధారణ ప్రజలు సైతం ఊపిరి పీల్చుకుంటున్నారు. చలి గాలుల కారణంగా గత రెండు రోజులుగా ఏసీలు, కూలర్ల వాడకం సైతం తగ్గి విద్యుత్ వినియోగం ఆదా అయ్యింది..

జిల్లాలో వర్షపాతం వివరాలు..(సె.మీ)

వేంసూరు	5.32
బోనకల్	4. 54
సత్తుపల్లి	4,46
వైరా	4.42
కల్లూరు	4.3
ఖమ్మం రూరల్	3,62
కొణిజర్ల	3.42
ఖమ్మం అర్బన్	3.6
సింగరేణి	3.1
పెనుబల్లి	2.92
కామేపల్లి	2.86
తల్లాడ	2.82
తిరుమలాయపాలెం	2,72
చింతకాని	2.54
రఘునాధపాలెం	2.44
ముదిగొండ	2.34
మధిర	2.14

రూ.13లక్షల గంజాయి పట్టివేత



మణుగూరుటౌన్, జూన్26(ఆంధ్రజ్యోతి): మణుగూరులోని హనుమాన్ టెంపుల్ వద్ద గురువారం ఎక్సైజ్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో రూ 13లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఫార్చునర్ కారులో తరలిస్తుండగా గంజాయిని పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన షేక్ సమీర్, సయ్యద్ అబూబాకర్, షేక్ ఫైసల్, ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేర్వంచ గ్రామానికి చెందిన తాణంకి ప్రవీణ్, కోటా హరీష్ ,షేక్ ఎస్వంత్ కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి గంజాయిని కోనుగోలు చేశారు. కారులో 22 కేజీల ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిపారు. దీనివిలువ రూ.13లక్షలు ఉంటుందని ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ సుంకర రమేష్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. వీరంతా గంజాయికి అలవాటు పడి ఈ అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో మణుగూరు ఎక్సైజ్ సీఐరాజిరెడ్డి, సిబ్బంది ఖరీమ్, హరీష్, వెంకటేష్, సుధీర్, హనుమంతరావు, ఉపేందర్, వీరబాబు, పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలి

» ఖమ్మం సీపీ సునీల్‌దత్,

» డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తొలగించాలి: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని





ప్రతిజ్ఞ చేస్తున్న సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్, కొత్తగూడెం మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలని, దీనిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పిలుపునిచ్చారు. గురువారం మాదకద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకోని ఖమ్మం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో సీపీ సునిల్ దత్, అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ సునిల్ దత్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత అని, అలాంటి యువత డ్రగ్స్, గంజాయి లాంటటి మత్తుపదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. కళాశాలలో, పాఠశాల్లో విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాల సమాచారాన్ని ఉపాధ్యాయులకు,యాంటీ డ్రగ్స్ కమిటీలకు డయల్ 100, 1908 పోలీస్ వారికి అందించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ సరదా కోసం మొదలైన అలవాటు మత్తులోకి నెడుతుందన్నారు మమత రోడ్డులోగల టాటా మోటార్ సర్వీస్ సెంటర్ నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి సీపీ, అదనపు కలెక్టర్, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా సైన్ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి, డాక్టర్ సతీష్, ఇన్స్‌ట్రక్టర్స్ భానుప్రకాష్, కరుణాకర్, స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమాజం నుంచి తొలగించాలి ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంపోస్టాఫీస్‌సెంటర్: డ్రగ్స్ వంటి మహమ్మారిని సమాజం నుంచి తొలగించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల వలే పని చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలో భారీ ర్యాలీని గురువారం ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ, డ్రగ్స్‌ను నివారించడంలో జిల్లా పోలీసుల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం క్లబ్‌లో జరిగిన సమావేశంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, జిల్లాఅటవీ శాఖ అధికారి కిష్టగౌడ్, ఎక్సైజ్ సూపరెండెంట్ జానయ్య, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ప్రతిజ్ఞను చేశారు. నాటిక రూపంలో నోడ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఎక్సైజ్ డీఎస్పీ కరంచంద్, జిల్లా సంక్షేమ అధికారిని లెనినాకుమారి, ఎఫ్‌డీవో కోటేశ్వరరావు,పోలీస్‌అధికారులు పాల్గొన్నారు.

కొసగుంపులో భద్రాచలం ఆర్డీవో విచారణ

బూర్గంపాడు, జూన్26: బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి బీట్‌లో గల కొసగుంపులో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు గురువారం విచారణ చేపట్టారు. ఈ నెల20న ఈ బీట్‌లో కందకాలు తీయడానికి వెళ్లిన అటవీశాఖ అధికారులను స్థానిక ఆదివాసీ మహిళలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ ట్రంచ్ పనులను అడ్డుకున్న మహిళలు ఫారెస్ట్ సిబ్బందిపై దుర్భాషలాడరని, ఆయుధాలతో దాడికి యత్నించారని చెప్పారు. దీంతో అటవీశాఖ అధికారులు తాత్కలికంగా పనులను నిలిపి వేసి వెనుదిరిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు గురువారం క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించారు. ట్రాక్టర్‌పై గ్రామానికి చేరుకుని ఇరువురు వర్గాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బూర్గంపాడు తహసీల్దార్ శిరీష, ఆర్ఐ హుస్సేన్, అశ్వాపురం రేంజర్ రమేష్ పాల్గొన్నారు.



ఇద్దరు ముద్దాయిలకు రెండేళ్ల జైలు

భద్రాచలం, జూన్26(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడులోని వంగపూడి నాగమణి అనే మహిళ ఇంట్లో 2021 ఏప్రిల్ 12న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు ముద్దాయిలకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించారు. ఈ మేరకు భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ తీర్పు వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సారపాకకు చెందిన కనుమళ్ల సందీప్ అలియాస్ సమ్మయ్య, బూర్గంపాడులోని ఎస్సీ కాలనీకి చెందిన పుట్టి నవీన్‌కుమార్ అలియాస్ నవీన్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి గురువారం తీర్పు వెల్లడించారు.

మెడికల్ షాపు దగ్ధం

బోనకల్,జూన్26(ఆంధ్రజ్యోతి):మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో గురువారం ఓమెడికల్ షాపు దగ్ధమైంది. ఈఘటన గ్రామంలో కలకలం రేపింది. కొంతకాలంగా వరుస వివాదాలతో పాటు హత్య కేసుకు సంబంధించి ట్రయల్స్ కూడా నడుస్తుండటంతో ఈ ఘటన స్థానిక ప్రజల్లో భయాందోళన కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కళ్యాణపు కిరణ్ కుమార్ 2015 నుంచి మెడికల్ షాపు నడుపుతున్నాడు. ఏడాది నుంచి షాపును తెరవడం లేదు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి షాపులో నుంచి పొగలు వస్తున్నాయని స్థానికులు యజమానికి సమాచారం అందించారు. అక్కడకు వెళ్లి చూడగా అందులో ఉన్న ఫ్రీజ్, ఎలక్ట్రిక్ పరికరాలతో పాటు విలువైన సామగ్రి కాలి బూడిదయ్యాయి. పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి మధిర సీఐ మధు, ఎస్ఐ పొదిలి వెంకన్నలు వెళ్లారు. షాపు దగ్ధమైన సంఘటనలో కొందరిపై అనుమానాలు ఉన్నాయని స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

హైదరాబాద్ చేతివృత్తుల ప్రదర్శనలో జిల్లావాసుల వస్తువులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్26(ఆంధ్రజ్యోతి): బోనాలఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్, హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో బీసీ చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారి జి. జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనకు జిల్లావాసులు తయారు చేసిన వస్తువులు ఉంచామని చెప్పారు. జూన్25 నుంచి 29 వరకు జరిగే బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఎగ్జిబిషన్‌లో కుమ్మరి, మేదరి నేత, చేనేత, వడ్రంగి, కమ్మరి, పూసల, వెనుకబడిన తరగతులకు చెందిన చేతివృత్తు వారు స్వయంగా తయారు చేసినటువంటి వస్తువుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని తెలిపారు.





పెంచుట.. తుంచుట కొరకే!

» ముందు చూపులేని వనమహోత్సవం
» విద్యుత్ తీగల కింద మొక్కలు నాటుతున్న కేఎంసీ



ఖమ్మం కార్పొరేషన్, జూన్26 (ఆంధ్రజ్యోతి): పెంచుట తుంచుట కొరకే అన్నట్లుగా ఉంది ఖమ్మం నగరంలో తెలంగాణ వనమహోత్సవం తీరు.. ఇప్పుడు నాటే మొక్క భవిష్యత్‌లో మహావృక్షంగా మారతాయి. అయితే ప్రభుత్వశాఖల మధ్య సమన్వయలోపంతో ఎదిగే కొద్ది మొక్కలు విద్యుత్‌శాఖ అధికారుల వేటుకు గురైతూనే ఉన్నాయి. నిత్యం ఖమ్మం నగరపాలక సంస్థ డీఆర్ఎఫ్ బలగాలు, విద్యుత్ శాఖ ఉద్యోగులు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉంటున్నాయని చెట్లను నరకటమే పనిగా పెట్టుకున్నారు. ఒకవైపు వృక్ష సంరక్షకులు కోర్టులను సైతం ఆశ్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల తీరు మాత్రం మారటం లేదు... ఖమ్మంలో తెలంగాణ వనమహోత్సవంలో భాగంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాండురంగాపురం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతాల్లో 300వరకు మొక్కలను నాటారు. వీటిలో కొన్ని మాత్రం విద్యుత్ తీగల కిందనే నాటుతున్నారు. ఒక్కటి, రెండు కాదు అనేక వీధుల్లో మొక్కలు నాటారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస ముందు చూపు లేకుండా విద్యుత్ తీగల కింద మొక్కలు ఎలా నాటారని ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధికాను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా విద్యుత్ తీగల కింది భాగంలో తక్కువ ఎత్తులో ఎదిగే పొగడ మొక్కలను నాటటం జరుగుతుందని, వాటిద్వారా విద్యుత్ సరఫరాకు ఇబ్బంది ఉండదని వివరణ ఇచ్చారు.

పాలీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్26 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్ 2025 ప్రవేశాల కౌన్సెలింగ్ గురువారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాలలో ప్రారంభమైంది. ఈ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా తెలిపారు. మొదటటి రోజు 286 మంది స్లాట్ బుకింగ్ చేసుకోగా 240మంది సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు హాజరయ్యారని తెలిపారు. ఆదివారం వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రఘునాథపాలెం మండలాన్ని
ఆదర్శంగా తీర్చిదిద్దుతా

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
» పుటానితండ,సూర్యతండాలో పంచాయతీ భవనాల ప్రారంభం



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాతానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పుటానితండా, సూర్యతండాలో గ్రామ పంచాయతీ భవనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను స్వయంగా అందించారు. పత్రాలు అందుకున్న వారిలో ఇళ్లు లేని వారు ఉన్నారా అని వాకాబు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రఘునాథపాలెం మండల కేంద్రం ఏర్పాటుతో పాటుగా అన్ని గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలను నిర్మాణం జరుపుతున్నామన్నారు. గ్రామ పంచాయతీ భవనాలకు కావాల్సిన కాంపౌండ్ వాల్, సమావేశ మందిరాలు, విద్యుత్, నీటివసతులు వెంటనే కల్పించాలని సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. తండాల్లో సీసీరహదారులు నిర్మాణం పూర్తి చేశామన్నారు.ఖమ్మం అర్బన్ ప్రాంతంలో కలిసి ఉన్న రఘునాథపాలెం మండలాన్ని తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయించానని, ఇప్పుడు మంత్రిగా రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. గతంలో వర్షాలపైనే ఆధారపడిన రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని 36చెర్వులకు సాగర్ జలాలు అందాయని గుర్తు చేశారు. రైతులు అయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. మారుతున్న కాలంతో పాటుగా మండలంలోని గిరిజన రైతులు వ్యవసాయంలో పంటల మార్పులు చేయాలని సూచించారు. కుటుంబంలోని పిల్లలు మంచిగా చదువుకుంటే ఆ కుటుంబం అన్నిరంగాల్లో ముందు ఉంటుందన్నారు. ఇదే ఉద్దేశ్యంతో రఘునాథపాలెంలో స్వామినారాయణతో పాటుగా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయించి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అవసరమైతే మరో గిరిజన వసతి గృహాలను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీజ, జెడ్పీ సీఈవో దీక్షారైనా, డీపీవో ఆశాలత, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దారు శ్వేత, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఏఎంసీ మాజీచైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమసంఘం వినతి

ఖమ్మంచర్చికాంపౌండ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రాజకీయ రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ వరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, లింగనబోయిన పుల్లారావు, గద్దె వెంకటరామయ్య, కేతనబోయిన నాగయ్య, నలమాస సుగుణ తదతరులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో కేఎంసీ కమిషనర్ సమీక్ష

ఖమ్మంకార్పొరేషన్, జూన్26(ఆంధ్రజ్యోతి): వరదలు, విపత్తులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. గురువారం కేఎంసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో ప్రజలను అప్రమత్తం చేయాలని ముంపు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

46, 52 డివిజన్లలో పర్యటన

వందరోజుల కార్యక్రమంలో భాగంగా 46,52 డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 46వ డివిజన్‌లో జటాయివు వాహనం పనితీరును పరిశీలించారు. 52వ డివిజన్‌లో గ్యాంగ్ వర్క్‌పై పలు ఆదేశాలిచ్చారు.

ప్రైవేటు ఆస్పతులకు జరిమానా

ఖమ్మం నగరంలోని రెండు ప్రైవేట్ హాస్పటల్స్‌కు కేఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు రూ.18వేలు జరిమానా విధించారు. నిబంధనలకు మేరకు బయోవ్యర్థాల నిర్వాహణ చేపట్టటం లేదని కేఎంసీ అధికారులు ప్రకటించారు.

అర్హులందరికీ ఇళ్లు

తిరుమలాయపాలెం, జూన్26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పక్కాగృహాలు మంజూరు చేస్తుందని మద్దులపల్లి ఏఎంసీ వైస్‌చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జూపెడలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల వితరణ

ఖమ్మంకార్పొరేషన్, జూన్26(ఆంధ్రజ్యోతి): 46వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి, కాంగ్రెస్ నాయకులు ప్రసన్నకృష్ణ దుస్తులను వితరణ చేశారు. వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. గురువారం 46వ డివిజన్‌లో కన్నం కనకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ రజ్జి, బాల్దే నాగేశ్వరరావు, కన్నం రమేశ్, వేముల విజయ్, సెల్వం జ్ఞానేశ్వర్, కిషన్, సూదగాని నరేశ్, బచ్చు సాయి, కంకల రాజేశ్ పాల్గొన్నారు.



దుస్తులు అందిస్తున్న కార్పొరేటర్ కన్నం వైష్ణవి, నాయకులు ప్రసన్న

తప్పు చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

» పరిపాలన గాలికొదిలి ఫోన్ ట్యాపింగ్‌పైనే దృష్టి
» అందుకే బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారు
» మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న రాజేందర్

కూసుమంచి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తప్పు చేస్తే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో సంవిధాన్ హత్యాదివస్ పేరిట జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలన గాలికొదిలి ఫోన్‌ట్యాపింగ్ ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసిందని ఆరోపించారు. పరిపాలన చేయమని ప్రజలు అవకాశం కల్పిస్తే నీతిమాలిన చర్యలతో బీఆర్ఎస్ నాయకులు ప్రజాగ్రహానికి గురయ్యారని విమర్శించారు. తన కుటుంబానికి చెందిన సుమారు 80మందికిపైగా ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలు తెలిసేందుకు పదేళ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఏడాదిన్నరకే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని ఈటల విమర్శించారు. 50సంవత్సరాల క్రితం కాంగ్రెస్ తన సొంత ప్రయోజనాలకోసం ఎమర్జెన్సీ విధించిందని,ఆరోజుల్లో జరిగిన అన్యాయ, అక్రమాల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కోర్టు తీర్పును అపహస్యం చేస్తూ 1975లో అర్థరాత్రి ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామికవాదులను, సామాజికవాదులను అన్యాయంగా అరెస్ట్ చేసి జైల్లో వేశారని, మీడియా స్వేచ్ఛను హరించారని గుర్తుచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీ చేసిన రాజ్యాంగ పరిహాసాన్ని ఇప్పటి యువతరానికి అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఈటల వివరించారు. అత్యధికకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి 100 సవరణలు చేశారని గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ద్వారా గెలిచిన ఇందిరాగాంధీ రాజ్యాంగాన్ని ఖూనీ చేసిందనిఅన్నారు. నీసా, నాసా చట్టాల ద్వారా అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా చాయ్‌వాలా ప్రధాని, అదివాసీ ద్రౌపదిముర్ము రాష్ట్రపతిగా ఉన్నారని, ఏనాడూ రాజ్యాంగ సవరణ చేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్రనాయకులు దేవకీ వాసుదేవరావు, తాండ్ర వినోద్‌రావు, నున్నా రవికుమార్, విజయ్‌రాజు, పాపారావు, పుణ్యవతి, రవిరాథోడ్, మల్లారెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, దాసరి వెంకన్న, వినాయక్, సంతోష్, గుండా ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



కూసుమంచి, జూన్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేట బజార్ గ్రామపంచాయతీ శివారు తాళ్లగడ్డతండాలో ఏర్పాటు చేసిన రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఆదారిలో వెళ్లే ప్రజలు చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారు. వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా..ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేముందు కనీస నిబంధనలు మర్చిపోతున్నారు. తండాలో విద్యుత్‌స్తంబానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని వెంటనే మార్చాలని మాజీ సర్పంచి భూక్యా శ్రీను అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ట్రై స్కూటీ అందజేత

కూసుమంచి, జూన్26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మునిగేపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు అప్పగాని రామ్మూర్తికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచన ట్రైస్కూటీ అందజేశారు.క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ దుంబూరు దరాయకర్‌రెడ్డి చేతుల మీదుగా స్కూటీని రామ్మూర్తికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జూకూరు గోపాలరావు, మాజీ సర్పంచ్‌లు చాట్ల పరుశురాం, గుగ్గిళ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీల నిర్మాణం

» మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య
» 6వ డివిజన్‌లో రైజింగ్ తెలంగాణ



6వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ఏ ప్రాంతంలో డ్రెయినేజీలు, రహదారులు, వంతెనలు అవసరాలుంటే రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం 6వ డివిజన్‌లో రైజింగ్ తెలంగాణ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులు డ్రైవ్ చేపట్టారు. పనులను మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యవేక్షణ చేశారు. ప్రధాన వీధుల వెంట తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. చేశారు. పరిశుభ్ర నగరానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఇళ్ల నుంచి వచ్చే చెత్త,చెదారన్ని పారిశుధ్య వాహనాలకు తడి,పొడి, హానికరమైన చెత్తగా విడివిడిగా చేసి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల తరుపున సమస్యలను మేయర్‌కు వివరించారు. కార్పొరేటర్లు పల్లెబోయిన చంద్రం, లకావత్ సైదులునాయక్, నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, వీరయ్య, శవి, రజిని పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో సమస్యలను పరిష్కరించాలి: ఐద్వా



నేలకొండపల్లి, జూన్26(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి సీహెచ్‌సీలో సమస్యలను పరిష్కరించాలని ఐద్వానాయకులు డిమాండ్ చేశారు. గురువారం వైద్యాధికారి రాజేష్‌ను కలిసి సీహెచ్‌సీలో ఉన్న సమస్యలను వివరించారు. చికిత్స పొందుతున్న రోగులనడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఐద్వా నాయకురాలు బెల్లం లక్ష్మి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రారంభమయ్యాయన్నారు. వైద్యశాలకు రోగుల తాకిడి బాగా పెరిగిందన్నారు. వైద్యశాలలో టాయిలెట్స్ పరిశుభ్రంగా లేక పోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కురుస్తున్న వైద్యశాల స్లాబును సరిచేయాలి డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు బలుసు ప్రమీల, కూచిపూడి శ్రీదేవి, భూక్యా జ్యోతి, యడవల్లి సైదమ్మ, సరోజిని తదితరులు వైద్యాధికారిని కలిసిన వారిలో ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

కామేపల్లి, జూన్26(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం గోవింద్రాలలో గురువారం చోటు చేసుకుంది. గోవింద్రాలకు చెందిన లకావత్ భీముడుకు చెందిన సూడి ఆవును గురువారం ఉదయం మేతకు వదిలాడు.. ఈ క్రమంలో గుగులోత్ హర్ష నర్సరీ వద్ద ఉన్న డీటీఆర్ ఎర్త్‌కు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. లింగాల ఏఈ శ్రీనివాసులు ఆవును పరిశీలించారు. పశువైద్యాధికారి నాగులు పంచానమా నిర్వహించారు. ఆవు విలువ రూ.80వేలవరకు ఉంటుంది.

శ్రీరాజగోపాలస్వామి దేవాలయ
భూముల కౌలు వేలం నేడు

కబ్జా భూమి లెక్క తేల్చాలని గతంలో రెండుసార్లు అడ్డుకున్న రైతులు

నేలకొండపల్లి, జూన్26(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని శ్రీరాజగోపాలస్వామి ఆలయ 13.25 ఎకరాల భూమి కౌలుకు శుక్రవారం ఉదయం ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవాలయ అధికారులు ప్రకటించారు. వేలం మూడు సంవత్సరాల కాలానికి ఉంటుందని, వేలం పాటలో పాల్గొనదలచిన రైతులు తొలుత రూ.50వేలను డిపాజిట్‌గా చెల్లించిన అనంతరం మాత్రమే వేలం పాటలో పాల్గొనటానికి అర్హులని చెప్పారు. దేవస్థానానికి బకాయిలున్న వారు కౌలు వేలంలో పాల్గొనటానికి అనర్హులని తెలిపారు.

కౌలు వేలం మూడోసారి

శ్రీరాజగోపాలస్వామి దేవాలయ భూములు కౌలు వేలం నిర్వహించటం ఇది మూడోసారి. గతంలో రెండుసార్లు కౌలు వేలం నిర్వహించటానికి అధికారులు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. దేవాలయ భూములు దాదాపుగా రెండు ఎకరాల వరకు కబ్జాకు గురైందని, భూమిని సర్వే చేయించి, తేల్చిన అనంతరమే కౌలు వేలం నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తూ అడ్డుకుంటున్నారు. కానీ దేవాలయ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకుంటున్నామని చెపుతున్నప్పటికీ, కౌలు వేలం నిర్వహించటంలో ఉన్న శ్రద్ధ సర్వే చేయించటంలో లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మూడోసారి కౌలు వేలాన్ని రైతులు అడ్డుకుంటే, నాలుగోసారి వేలం నిర్వహించకుండానే కౌలుకిచ్చే అధికారం దేవాలయ అధికారులకు ఉంటుందని సమాచారం. శుక్రవారం జరిగే కౌలు వేలంలో ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు



నేలకొండపల్లిలో పోలీసుల ర్యాలీ



పిండిప్రోలులో ర్యాలీ ప్రారంభిస్తున్న ఏసీపీ

నేలకొండపల్లి, జూన్26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, అందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం నేలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ మాట్లాడుతూ నేటి సమాజాన్ని డ్రగ్స్‌మహమ్మారి పట్టిపీడిస్తున్నదన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్‌కు బానిసలైతే జీవితం నాశనమైపోతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులతో పాటుగా కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, కుక్కల హనుమంతరావు, జెర్రిపోతుల అంజని, బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, బీఆర్ఎస్ నాయకుడు తెల్లగొర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: యువతను జీవచ్ఛవంలా మారుస్తున్న మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతీ ఒక్కరు కృషిచేయాలని ఏసీపీ తిరుతిపరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ కూసుపుడి జగదీష్, ఎస్ఐ2 రామలింగారెడ్డి, సిబ్బంది వీరస్వామి, వెంకటేష్, రాజు, సర్దార్‌సింగ్, రమాదేవి, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఖమ్మంలీగల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని న్యాయసేవాఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.వి.చంద్రశేఖరరావు అన్నారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈకార్యక్రమంలో న్యాయసేవాసంస్థ సభ్యులు సంధ్యారాణి, మందడపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ వితరణ



ఖమ్మంఖానాపురంహవేలి, జూన్26(ఆంధ్రజ్యోతి):నగరంలోని ఖాజీపుర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డీఏల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షూస్ వితరణగా అందించారు. 6నుంచి 10 వతరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. క్రమశిక్షణతో చదువుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శరత్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, నిర్వాహకులు శేఖర్‌రెడ్డి, చందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మోదీ విధానాలను ఖండించాలి

ముదిగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఖండించాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. గురువారం ముదిగొండ సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ ఆయుధాలు అమ్ముడుకోవడం కోసమే అమెరికా ప్రపంచ దేశాల మధ్య వివాదాలు సృష్టిస్తోందన్నారు. దేశంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, బండి పద్మ, రాయల శ్రీనివాస్, పర్లకోల రాంబాబు,కల్యాణ్, పద్మ, భద్రయ్య,దామోదర్, ఉపేందర్, నారాయణ, రఘుపతి, రామారావు, అరుణ పాల్గొన్నారు.

విద్యుత్ కంచె ఏర్పాటు చట్టరీత్యా నేరం



పొలంబాటలో రైతులతో మాట్లాడుతున్న ఏఈ శ్రీనివాసరావు

ముదిగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పొలాల చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చట్టరీత్యా నేరమని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు అన్నారు. ముదిగొండ మండలం మేడేపల్లిలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో రైతులు బావుల వద్ద ఏర్పాటుచేసుకున్న మోటర్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వర్షం వచ్చినప్పుడు విద్యుత్ స్తంభాలను తాకడం వంటివి చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలి : సీఐటీయూ



ఐసీడీఎస్ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని, సీఐటీయూ రాష్ట్రకమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వచ్చేనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ స్థానిక ఐసీడీఎస్ అధికారులకు గురువారం సమ్మె నోటీస్‌ను అందజేశారు. శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటిని అమలు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తుందన్నారు. ఉద్యోగ భద్రత, ఉపాధి కోల్పోతారని, కార్మిక శాఖ కూడా నిర్వీర్యం కాబోతుందని, ఈ ఆలోచనను తక్షణమే పాలకులు విరమించుకోవాలని కోరారు. నాయకులు మరియమ్మ, శ్రీలక్ష్మీ, షకీనా, నాగేంద్ర, విజయలక్ష్మీ, కొలికపోగు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలి

తల్లాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ రంజాన్, డీఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ విధానం తీసుకురావాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంలకు పదోన్నతి కల్పించాలన్నారు. పీఆర్సీత తదితర సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. తల్లాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లాల్‌సయ్యద్, టి.శ్రీనివాసరావు, టి.ఇందుప్రియ, డి.రత్నకుమారి, కె.వెంకటేశ్వర్లు, జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవయవాలలో ముఖ్యమైనవి కళ్లు

▸▸ 15వ బెటాలియన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



ఉద్యోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డా.దేవేందర్

సత్తుపల్లిరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మానవుని అవయవాలలో అత్యంత ముఖ్యమైనవి కళ్లు అని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నారు. గురువారం మండలంలోని గంగారం బెటాలియన్‌లో ఖమ్మంకు చెందిన మ్యాక్సీ విజన్ ఐ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళ్లు లేకపోతే ఈ ప్రపంచాన్ని చూడలేమని, ముందస్తు పరీక్షలతోనే జాగ్రత్తలు తీసుకుంటూ సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బెటాలియన్ ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు డాక్టర్ దేవేందర్ పరీక్షలు చేశారు. అదనపు దళాధిపతి అంజయ్య, సహాయ దళాధిపతులు ఎస్‌డీ.రంగారెడ్డి, శ్రీధర్‌రాజు, టెక్నీషియన్ పాషా, కౌన్సిలర్ శ్రీనివాస్‌తో పాటు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ షాపు దగ్ధానికి.. కారకులను శిక్షించాలి

▸▸ సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని

బోనకల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపు దగ్ధమైన సంఘటనకు సంబంధించి కారకులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావులు పోలీసులను కోరారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో దగ్ధమైన మెడికల్ షాపును గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హత్య కేసులో సాక్షిగా ఉన్న కళ్యాణపు కిరణ్ కుమార్ షాపు దగ్ధం కావడం పలు అనుమానాలకు తావిస్తుందని ఆరోపించారు. భయాందోళనకు గురి చేసే ఘటనకు సంబంధించి అసలు కారకులను పట్టుకొని అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, సొసైటీ ఛైర్మన్ మాదినేని వీరభద్రం, జొన్నలగడ్డ సునిత, కళ్యాణపు బుచ్చయ్య, ఏడునూతల లక్ష్మణరావు, కళ్యాణపు శ్రీనివాసరావు, కారంగుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

▸ మత్తు పదార్థాల వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు
▸ యువత మాదక ద్రవ్యాలు వాడితే కఠిన చర్యలు: సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మాదక ద్రవ్యాల నిర్మూలనకు ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీపీ రెహ్మాన్

వైరా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత నడుం బిగించాలని వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్ పిలుపునిచ్చారు. గురువారం వైరాలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ఏసీపీ ప్రారంభించారు. పోలీస్, ఎక్సైజ్‌శాఖల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో జాతీయ ప్రధాన రహదారిలో ర్యాలీ చేశారు. ఆతర్వాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో జరిగిన సదస్సులో ఏసీపీ ప్రసంగించారు. వైరా ఎస్ఐ పి.రామారావు, ఎక్సైజ్ సీఐ మమత, ఎస్ఐలు రత్నప్రసాద్, సాయిరాం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ప్రిన్సిపల్ ఎల్.నవీనజ్యోతి పాల్గొన్నారు.

మధిరరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలు వాడితే కఠిన శిక్షలు పడతాయని వాళ్ల భవిష్యత్ నాశనం అదుతుందని యువత డ్రగ్స్ వాడకుండా చూడాలని మధిర సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రశాంతి కోరారు. గురువారం మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మధిర మునిసిపాలిటీ పరిధిలోని జీలుగుమాడులో షేర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యాయచైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. డ్రగ్స్ తయారు చేయడం వినియోగించడం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సభ అనంతరం ప్రజలందరితో కలిసి ర్యాలీ నిర్వహిచారు. షేర్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు గోపాల్‌రెడ్డి, మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షమీమ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, రామరాజు, పారాలీగల్ వాలంటీర్స్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మధిరరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మధిర మండలం కృష్ణాపురం బీసీ గురుకుల పాఠశాలలో మధిర సీఐ మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి ఆధ్వర్యంలో గురువారం మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ కార్యక్రమాన్ని సీఐ జెండా ఊపి ప్రారంభించారు. మత్తుపదార్థాలకు బానిలసై తమ బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోకూడదని విద్యార్థులు ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత పురోగతికి, భావి జీవితానికి అవరోధంగా నిలుస్తున్న మాదకద్రవ్యాలను సమాజం, నుంచి సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు.

సత్తుపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం, సిగరెట్లు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వంటి మత్తు పదార్థాల వినియోగిస్తే ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుందని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపీ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటి యువత మాదకద్రవ్యాల వల్ల తీవ్రంగా ప్రభావితమవుతున్నారని, దీంతో మానసికంగా కుంగుబాటుతో పాటు శారీరక ఆరోగ్యాన్ని ధ్వంసం చేస్తాయని, విద్యార్థులు వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహేష్, ఎం.బాలకృష్ణ, డా.మాధవి, రవికుమార్, ఎస్‌కే.పీర్ సాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'డగ్స్‌ని తరిమకొడదాం...యువతను కాపాడుకుందాం'ని నినదిస్తూ గురువారం తల్లాడలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ, కెవిఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ పాల్గొన్నారు.

బోనకల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని ఎస్ఐ పొదిలి వెంకన్న సూచించారు. బోనకల్‌లో గురువారం ఆయన మాదక ద్రవ్యాల నిర్మూలన పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



టీబీ వ్యాధిపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ మౌనిక

టీబీ వ్యాధిపై అవగాహన

ఏన్కూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపై పీహెచ్‌సీ వైద్యులు మౌనిక అవగాహన కలిగించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి చిన్నిపిల్లల్లో టీబీ వ్యాధిని ఎలా గుర్తించాలనే విషయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ వ్యాధి పెద్దవారికే కాకుండా చిన్నపిల్లల్లో కూడా వస్తుదన్నారు పిల్లల్లో లక్షణాలున్నట్టయితే ప్రాథమిక ఆరోగ్య కేద్రానికి లేదా జిల్లా క్షయ నిర్మూలన కార్యాలయానికి పంపించాలని కోరారు. టీబీ అలర్ట్ ఇండియా జిల్లా కో ఆరిడనేటర్ ప్రభాకర్, డీపీఎం వెంకట్, సత్తుపల్లి డివిజన్ హెచ్‌ఈవో వేణుగోపాల్, సీహెచ్ఎన్ పుణ్యవతి, పీహెచ్‌సీ టీబీ నోడల్ అధికారి పద్మ, పాల్గొన్నారు.

28నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

మధిరరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28, 29తేదీలలో మధిరలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు పడకంటి మురళి, మందా సైదులు తెలిపారు మధిరలోని సీపీఎం కార్యలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు.

వానాకాలం సీజన్ వరి నాట్లు ప్రారంభం



వాచ్యానాయక్‌తండాలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

కల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) గత రెండు రోజులుగా అడపాదడపాగా కురుస్తున్న వర్షంతో వాతవరణం చల్లబడింది. దీంతో వరి మడులలో నీరు చేరటంతో కల్లూరు మండల ప్రాంతానికి చెందిన రైతాంగం వానకాలం వ్యవసాయం సీజన్ పనులు చేపట్టారు. గత నెలలో వరి నార్లు పోసిన రైతులు ఇటీవల అడప దపాగా కురుస్తున్న వర్షాన్ని ఆధారాంగా చేసుకొని వరి మడుల్లో దమ్ములు చేసి నాట్లు వేసేందుకు సిద్ధమతున్నారు. ఆ క్రమంలోనే మండలంలోని వాచ్యానాయక్‌తండాలో గురువారం పలువురు రైతులు వరి నాట్లు ప్రారంభించారు. మండలంలో సుమారు 33 వేల ఎకరాల్లో వరి సాగువుతుంది. ఇలా ఖమ్మం ఉమ్మడి జిల్లా స్థాయిలోనే కల్లూరు మండలం వరి సాగులో అగ్రగామిగా నిలిచింది. దీంతో ఈ ప్రాంతానికి చెందిన అన్నదాతలు ఇతర ప్రాంతాల కంటే ముందస్తుగా వరి నాట్లు వేయటం ఆన్వాయితీగా వస్తుంది. మరి కొంత మంది రైతులు కరివేద సాగులో వరి సాగు చేపట్టారు. ఇప్పటికే వరి విత్తనాలు చల్లారు. ఇక వర్షాలు కురవటం ప్రారంభం కావటంతో అన్నదాతల్లో ఆనందం వెల్లువిరుస్తుంది. వాతవరణం చల్లబడటం, అడప దడపాగా వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు కూడ వ్యవసాయ పనులపై దృష్టి సారించారు.

బురద మయంగా రోడ్లు.. ప్రజల అవస్థలు



బురదమయంగా మారిన రోడ్డు

మధిరరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మదిరి మునిసిపాలిటీ పరిధిలోని టీచర్స్‌కాలనీలో రోడ్డు బురదమయంగా ఉండి నడవడానికి వీలులేకుండా అధ్వాన్నంగా మారింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదతో చిత్తడిగా మారింది. అంతేకాక అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పైపులైన్లు వేసేందుకు రోడ్లు పగులగొట్టారు. ఒకేసారి అన్ని బజార్లలో రోడ్లను పగులగొట్టి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు మొదలుపెట్టడం వల్ల గుంతలు ఉండి ఇంటిలోనుంచి ప్రజలు బయటకు రాలేక ఇబ్బందులు పడుతన్నారు . బయటకు అడుగు పెట్టాలంటే ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టీచర్స్‌కాలనీలోరోడ్లను అభివృద్ధి చేయాలని, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ కోసం తీసిన గుంతలను వెంటనే పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో సమస్యలపై ఐద్వా సర్వే

వైరా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలపై ఐద్వా వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడున్న సమస్యలను రోగులతోపాటు వైద్యులు కూడా ఐద్వా బృందానికి తెలిపారు. గర్భిణీ మహిళలు, రోగులకు సరిపడా పడకలు లేవని, లేడీ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని, వాచ్‌మెన్ లేరని, రాత్రి డ్యూటీలో ఉండే వైద్యులకు రక్షణ లేదని, బాత్‌రూమ్‌లు సరిగా లేవని ఇతరత్రా అనేక సమస్యలున్నాయని సర్వే బృందానికి వివరించారు. రజిత, కృష్ణవేణి, కాంసాని మల్లికాంబ, బత్తుల ప్రమీల, మాదినేని రజిని, మాడపాటి సుజాత పాల్గొన్నారు.

కల్లూరు పురపాలికను ఆధునీకరించాలి

▸▸ కమిషనర్‌కు మంత్రి తుమ్మల ఆదేశం



కమిషనర్‌కు సూచనలిస్తున్న మంత్రి తుమ్మల

కల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పురపాలికను ఆధునీకరణగా తీర్చిదిద్దాలిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సతుపల్లి వైపు నుంచి ఖమ్మంకు వెళ్లతున్న మంత్రి గురువారం కల్లూరులోని మునిసిపాలిటీ కార్యాలయం ఎదురుగా మార్గ మధ్యంలో కోద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా విస్తరించిందని ముందుగా ఆయన గుర్తు చేశారు. నూతనంగా మునిసిపాలిటీగా అవతరించినందున పట్టణాన్ని అన్ని విధాలుగా అధునీకరణ అభివృద్ధి పనులు చేయాల్సి వుందిని కమిషనర్ సంపత్‌కుమార్‌కు మంత్రి తుమ్మల సూచించారు. ప్రధానంగా రూ.1.50 కోట్ల అంచనాతో డ్రెయినేజీల ఆధునీకరణ, మరో రూ.1.50 కోట్ల అంచనాతో సెంట్రల్ లైటింగ్ ఆధునీకరణ చేయాల్సి ఉందిన్నారు. ఈ పనులను నిధుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని తగిన అంచనాతో కార్యాచరణ చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కల్లూరు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు మంత్రి తుమ్మలను ప్రత్యేకంగా కలిసి కల్లూరు పురపాలక సంఘ అభివృద్ధి, ఆధునీకరణ పనుల ఆవశ్యకత గురించి వివరించారు. ఆర్యవైశ్య ప్రముఖులు పసుమర్తి రాంబాబు, చారుగుండ్ల అచ్యుతసీతారామారావు, కాంగ్రెస్ నాయకులుయాఖుబ్‌అలీ, గురువయ్య, పురపాలక మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు రోల్‌మోడల్‌గా ఎదగాలి

తల్లాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివినా మంచి వనరులను ఉపయోగించుకుని విద్యార్థులు రోల్ మోడల్‌గా ఎదగాలని తల్లాడ ఎంఈవో ఎన్.దామోదరప్రసాద్ అన్నారు. తల్లాడ మండలం కుర్నవల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో లింగ సమానత్వ ఆదర్శ మహిళలతో బాలికల చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోల్‌మోడల్స్ అయిన పూర్వ విద్యార్థినీలు వైరా టీజీఆర్ఎస్ ప్రిన్సిపాల్ బత్తుల రమ, ఉపాధ్యాయురాలు ఎస్‌కే షాహీదా, గౌరి, ప్రతిభావంతురాలైన బీటెక్‌విద్యార్థిని ఉషశ్రీలను ఖమ్మం జీసీడీవో టి.తులసి, ఐసీడీఎస్ అధికారిణి సంహాన్, హెచ్‌ఎం ఝాన్సీరాణీలు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు పుల్లయ్య, వెంకయ్యపాల్గొన్నారు.



ఆదర్శ పూర్వవిద్యార్థినీలను సన్మానిస్తున్న జీసీడీవో

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి శివప్రసాద్

కల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనిస్తుందని ఎక్స్ అఫీషియో ఇన్‌చార్జి, ఫిషరీస్ డెవలప్మెంట్ జిల్లా అధికారి శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలో గురువారం మత్స్య సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సంఘం పరిధిలోని సభ్యులందరి ఆమోదంతో 2024-2025 సంవత్సరానికి 1434 వసలికి రూ. 44,290 9 చెరువుల లీజుకు గాను సదరు నగదును చెల్లించేందుకు ముందుకు వచ్చారు. సభ్యులంత ఏకగ్రీవంగా తీర్మానిస్తూ సదరు నగదును మత్స్యశాఖకు చెల్లించారు. పెద్దకోరుకొండి మత్స్యసహకార సంఘం పరిధిలో గల చిన్నకోరుకొండి పంచాయితీలోని వెంపటి చిన్న చెరువు, చింతల చెరువు, పెద్దకోరుకొండిలోని గంగదేవుని కుంట, బండికుంట, పెద్దచెరువు, వెన్నవల్లిలో కోమటి కుంట, ఊరచెరువు, నల్లచెరువు, తెలగవరంలోని చెరువులు కూడ పెద్దకోరుకొండి మత్స్య సహకారం సంఘం పరిధిలో కోనసాగుతన్నాయని శివప్రసాద్ చెప్పారు. ఈ సొసైటీ పరిధిలో జూన్ 30 తేదితో చెరువుల లీజ్ గడవు ముగియనున్నందున మరో ఏడాది పాటుగా చెరువుల లీజ్ గడువును పెంచినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ పరిధిలో గల 259 సభ్యులు పాల్గొన్నారు. సభ్యులందరికి గుర్తింపు కార్డులను ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. సొసైటీ సభ్యులు తోటపల్లి వసంతరావు, రామకృష్ణ, మహేష్, మురళి, విష్ణు, గొర్రెపాటి రవికృష్ణ, పెద్దసైదులు, ఫిషరీస్ తరుపున బెనర్జిబాబు

జమలాపురం ఆలయ హుండీ లెక్కింపు

ఎర్రుపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం కానుకల హుండీని ఆలయ అధికారుల సమక్షంలో సిబ్బంది గురువారం లెక్కించారు. ఖమ్మంజిల్లా దేవాదాయశాఖ పరిశీలకులు ఎం.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో భక్తులు శ్రీవారికి సమర్పించిన కానుకలు, ముడుపులు 95రోజులకు గాను రూ.41,23,546లు వచ్చినట్టు ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. వేసవి సెలవులు కావడంతో గతంలో కంటే ఈత్రైమాసికంలో శ్రీవారిహుండీ ఆదాయం గణనీయంగా రూ.8లక్షలపైగా పెరిగింది. ఆలయ ధర్మకర్త ఉపన్సల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, రాజీవ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సమర్ధవంతమైన నిర్వహణ, పారదర్శకతపై దృష్టిపెట్టండి


▸▸ జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్ధ్ విక్రమ్‌సింగ్

సత్తుపల్లిరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సమర్ధవంతమైన నిర్వహణ, పారదర్శకతపై దృష్టిపెట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ సూచించారు. పరిపాలనా పర్యవేక్షణలో భాగంగా గురువారం సత్తుపల్లిలోని ప్రభుత్వ టింబర్ డిపోను సందర్శించి ఆవరణలోని నిర్మాణంలో ఉన్న అటవీ విభాగ కార్యాలయం, మినీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను పరిశీలించారు. సమగ్ర దృక్పథం, పరిపాలన, పచ్చదనం, ప్రజల జీవనోపాధిని సమన్వయం చేస్తూ అటవీ శాఖ సంకల్పాన్ని ప్రతిబింబించేలా పనిచేయాలని ఆకాంక్షించారు. అంతకముందు ఎఫ్‌డీవో కార్యాలయాన్ని సందర్శించి పత్రాలు, గోదాముల నిర్వహణ, సిబ్బంది నియామకాలు, సేవా, ఇతర కార్యకలాపాలను సమీక్షించారు. మొక్కల నాటే కార్యక్రమంపై అటవీ సిబ్బంది, స్థానిక వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదేవిధంగా గూడూరు గ్రామంలోని వీఎస్ఎస్ సభ్యులతో సమావేశమై జీవనోపాధి ప్రాధాన్యతలపై చర్చించారు. అటవీ ఆధారిత, అనుబంధ పథకాల ద్వారా ఆదాయ మార్గాలను పటిష్ఠం చేయాలని, మహిళల భాగస్వామ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎఫ్‌డీవో మంజుల, రేంజర్ స్నేహలత, డీఆర్ఓ మంగపతి, ఎఫ్ఎస్ఓ నర్సింహా, ఎఫ్‌బీఓలు శ్రీనివాస్, కృష్ణ, వైల్డ్ లైఫ్ ఎక్స్‌ఫ్ట్ దీపక్ పాల్గొన్నారు.



టింబర్ డిపోను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్

విపత్తుల కాలంలో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వేణు

వైరా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదలు ఇతరత్రా సంభవించే విపత్తుల కాలంలో అన్ని శాఖల వారు అప్రమత్తంగా ఉండాలని వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు సూచించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు గురువారం మునిసిపల్ కార్యాలయంలో వర్షాకాలంలో విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితుల గురించి వివరించారు. రెవెన్యూ, మునిసిపల్, వైద్యఆరోగ్యశాఖ, మత్స్యశాఖ, ఆపద మిత్రులు, ఇతరశాఖల సిబ్బందితో విపత్తుల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఎంపీడీవో సరస్వతీ పాల్గొన్నారు.

ముదిగొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడే ఈ వర్షాకాల సీజన్‌లోనే ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోగలుతారన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వర్షంలోనే సీసీ రోడ్డు నిర్మాణం

వైరా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వర్షంలోనే వైరాలో రిజర్వాయర్ రోడ్డులో సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించడంతో కొంతమేర దెబ్బతిన్నది. అసలే నాణ్యతాప్రమాణాలు గాలికొదిలేసి సీసీ రోడ్డు నిర్మిస్తున్నారనే విమర్శలున్నాయి. రూ.80లక్షల సుడా నిధులతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా రోడ్డు నిర్మిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో బుధవారం జోరున కురుస్తున్న వర్షంలో సిమెంట్ రోడ్డు నిర్మించటంతో అది గతుకులుగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.